క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



అలంకరణలో పరమశివుడు

చిలమత్తూరు: మండలంలోని మొరంపల్లి శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామి, వినాయక విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో పురోహితులు హోమాలు, అభిషేకార్చనలు చేశారు. అలాగే నాగులను ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్ల పంపిణీ

హిందూపురం: పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో భారతీ శ్రీనివాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు, బెడ్ షీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలన్న ఉద్దేశంతో పాంచ జన్య భారతి శ్రీనివాస్ ట్రస్ట్ స్థాపించామని, ఇందులో భాగంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రమేష్, రాము, నారాయణమూర్తి, పాఠశాల కరస్పాండెంట్ నందకుమార్, భాస్కర్, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలోని తిమ్మాపురం సమీపంలో జరుగుతున్న అనంతపురం జాతీయ రహదారి పనులను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామాత్యులు సవిత ఆదివారం పరిశీలించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి తారు రోడ్డు గుంతలు పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెనుకొండ ఓవర్ బ్రిడ్జి నుంచి కుంభకర్ణ వరకు, గుట్టూరు నుంచి మరకుంటపల్లి వరకు రూ.18 కోట్లతో పనులు చేపట్టింది. నాణ్యతతో పనులు చేపట్టాలని మంత్రి కాంట్రాక్టర్‌కు సూచించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న దృశ్యం

హిందూపురం: జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరం తెలుసుకుని మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందన్నదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణం పాత బస్టాండ్ ఏరియా వద్ద త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రబోధానందస్వామి రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో ముద్దిరెడ్డిపల్లి కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సభ్యులు సుభద్ర, మమత, పార్వతి, సరస్వతి, కళ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న తూనికలు కొలతల అధికారి శంకర్, డీటీ హారిక

హిందూపురం అర్బన్: తూనికల కొలతల అధికారి శివశంకర్, డిప్యూటీ తహసీల్దార్ హారిక ఆదివారం పట్టణంలోని పెట్రోల్ బంకులను ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని మణి పెట్రోల్ బంకులో కొలతలతో పాటు పెట్రోల్, డీజిల్ నాణ్యత పరిశీలించారు. వినియోగదారులకు తాగునీరు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వారం రోజులుగా పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. నిబంధనలు అతిక్రమించినా, వినియోగదారులను మోసం చేసినా పెట్రోల్ బంకును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ముళ్లపొదల తొలగింపు



జేసీబీతో ముళ్లపొదలను తొలగింపజేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

పెనుకొండ రూరల్: మండలంలోని తిమ్మాపురం రైల్వేగేటు సమీపంలో ఆదివారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు జేసీబీ ద్వారా దగ్గరుండి పనులు చేయించారు. ముళ్లపొదలతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వైద్యసేవలకు మంగళం

- వైద్యం ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపుల నిర్వహణ
- స్పెషలిస్ట్ డాక్టర్లతో సేవలు
- వైద్యానికి పెద్దపీట వేసిన మాజీ సీఎం వైఎస్ జగన్
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు సైతం పంపిణీ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం (ఫైల్)

గుడిబండ: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను కూడా అందజేసేవారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రెఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్యం భారంగా మారింది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇవీ..

నియోజకవర్గ వ్యాప్తంగా 2 లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. మడకశిర మండలంలో మడకశిర అర్బన్, కల్లుమర్రి, నీలకంఠాపురం, గుండుమల, కదిరేపల్లి మొత్తం 5, గుడిబండ మండలంలో మోరుబాగల్, గుడిబండ మొత్తం 2, అగళి మండలం కేంద్రంలో పీహెచ్‌సీ, రోళ్ల మండల కేంద్రంలో సీహెచ్‌సీ, అమరాపురం మండలంలో హేమావతి, అమరాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

పడకేసిన పల్లె వైద్యం..

కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. ఆధునిక వైద్య సేవలకు పల్లె ప్రజలు క్రమేపీ దూరమవుతున్నారు. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు పటిష్ట చర్యలు చేపట్టింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు అందిచేందుకు వీలుగా సిఫార్సులు పంపేవారు.

చిన్న పిల్లలు, అవ్వాతాతలు, వికలాంగులు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగులకు సంబంధించి కార్పొరేట్ అస్పత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటి ఆస్పత్రులలోనూ పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతీ వైద్య శిబిరానికి సుమారు ఐదుగురు స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. మునుపెన్నడూ ప్రభుత్వ వైద్యంలో లేనివిధంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటికి అద్దాలు కూడా అప్పటికప్పుడే కంటి వైద్య నిపుణులు అందించే వారు. గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డీ ఎకో కూడా వైద్య శిబిరంలోనే తీసేవారు.

పౌష్టికాహారంపై అవగాహన..

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్యంగా అంగనవాడి కార్యకర్తలు చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శన ఆకర్షణీయంగా నిలిచేది. ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు అంగన్‌వాడీ స్టాల్స్‌ను సందర్శించేవారు. వారు తయారు చేసిన చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, రొట్టెలు, సద్ది రొట్టెలు, రాగులు, మొలకెత్తిన విత్తనాలు తదితర పౌష్టికాహారంపై అవగాహన కల్పించేవారు. అదే విధంగా గుడ్లు, పాలు, బాలామృతం గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు కావలసిన పౌష్టికాహారం తదితర విషయాలపై వివరించేవారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాలన్నీ ఆగిపోయాయి.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ఇటీవల కురిసిన వర్షాలు, భిన్న వాతావరణంతో పాటు ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా తదితర విష జ్వరాలు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఒళ్లు నొప్పులు, తలనొప్పి, విరోచనాలతో బాధపడుతున్న ప్రజలకు వైద్యం అందించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుండటంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్షను మళ్లీ ప్రారంభిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇబ్బందులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. ప్రతి పంచాయితీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేవు. ప్రజలకు మేలు చేసే ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మళ్లీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే వారే లేరు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసే వారు. ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రస్తుతం ప్రజలను పట్టించుకునే వారు కరువయ్యారు.

– మహేంద్రప్ప, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, అగళి మండలం

ఆదేశాలు లేవు

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై ఇంత వరకు ఆదేశాలు రాలేదు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సౌందర్య, పీహెచ్‌సీ వైద్యురాలు, గుడిబండ

ఫుట్‌బాల్ సూపర్ లీగ్‌లో హిందూపురం విజయం



మొదటి స్థానంలో నిలిచిన హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు



జిల్లా స్థాయి ఫుట్‌బాల్ విజేతగా లేపాక్షి జట్టు

హిందూపురం టౌన్: అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన రూరల్ ఫుట్‌బాల్ లీగ్ అండర్–12 బాలుర సూపర్ లీగ్ మ్యాచ్‌లలో హిందూపురం యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మొదటి మ్యాచ్‌లో హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు కళ్యాణదుర్గం జట్టుపై 5–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్ మ్యాచ్ గుత్తి జట్టుపై ధర్మవరం జట్టు 2–0 గోల్స్‌తో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో కళ్యాణదుర్గం జట్టుపై 2–1 గోల్స్ తేడాతో ధర్మవరం జట్టు విజయం సాధించింది. నాలుగో ఫైనల్ మ్యాచ్‌లో గుత్తి టౌన్ జట్టుపై 4–1 గోల్స్ తేడాతో హిందూపురం యూనైటెడ్ జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ధర్మవరం జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆయా జట్లకు ట్రోఫీ అందజేశారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్, జట్టు కోచ్‌లు మహమ్మద్ సలీం, యోగవర్ధన్‌రెడ్డి అభినందించారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ విజేత 'లేపాక్షి'

లేపాక్షి: అనంతపురంలోని స్పోర్ట్స్ విలేజ్‌లో నిర్వహించిన ఆర్డీటీ జిల్లా స్థాయి అండర్–12 బాలికల పోటీల్లో లేపాక్షి మండల ఫుట్‌బాల్ క్లబ్ విజేతగా నిలిచింది. మూడు నెలలుగా జరుగుతున్న పోటీల్లో ఫైనల్ రౌండుకు చేరుకుని ఉత్తమ జట్లుపై విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఈ విజయంపై విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఫుట్‌బాల్ ప్రముఖులు, కోచ్‌లు హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేసినట్టు ఫిజికల్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప మండలపూజ



వీరగాసె నృత్యం చేస్తున్న దృశ్యం

రొళ్ల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం అయ్యప్ప భక్తులు వైభవంగా మండల పూజ నిర్వహించారు. వేకువజామునే అయ్యప్ప భక్తులు నియమనిష్ఠలతో పూజలు చేశారు. సుబ్రహ్మణ్య, అయ్యప్ప, గణపతి విగ్రహాలతో పాటు మాళికాపురత్తమ్మ దేవికి మూల విగ్రహాలకు అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన చేపట్టారు. అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన మండపంలో కొలువుదీర్చి ఉత్సవ విగ్రహాన్ని బస్టాండ్ వరకూ ఊరేగింపు చేపట్టారు. అయ్యప్ప భక్తులు రంగులు చల్లుకుంటూ భజనలు చేస్తు నృత్యం ఆడారు. ఊరేగింపులో వీరగాసె నృత్యం చూపర్లను ఆకట్టుకుంది.

గోరంట్లలో..



అయ్యప్ప విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గోరంట్ల: స్థానిక దామరోడ్డు సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామి మండల పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మాలధారులు అయ్యప్పస్వామి గీతాలను ఆలపించారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.


ఘనంగా కనకదాస జయంతి

పరిగి: మండలంలోని కాలువపల్లి, సుబ్బరాయనిపల్లిలో ఆదివారం కురుబల ఆరాధ్య దైవం భక్త కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి కనకదాసకు సమర్పించారు. ఈసందర్భంగా గొరవయ్యలు తమ నాట్యంతో ఆకట్టుకున్నారు. కురుబలు కనకదాస చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నివేదిక త్వరగా అందజేయాలి

పెనుకొండ: ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన ఏక సభ్య కమిషన్ తన నివేదికను త్వరగా ప్రభుత్వానికి అందజేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు డాక్టర్ కేబీ మధు మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ, ఇతర ఉద్యోగాల నియామకాలను వాయిదా వేశారన్నారు. నాయకులు ప్రదాప్, పలక ఆంజనేయులు, బాబు, నరసింహ, రాజు, చిన్న, బైలాంజినేయులు, నాగరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ఖలందర్

అమరాపురం: ముస్లిం యువత అన్ని రంగాల్లో ముందుండాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన ముస్లిం యువత సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువకులు కేవలం చేతివృత్తులకే పరిమితం కాకుండా బాగా చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ముస్లిం యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. సేవ చేయడం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు హిదయత్, షబ్బీర్, రాహిత్, బాబా ఫక్రుద్దీన్, ఇబ్రహీం, సాదఖ్, శర్మాస్, దాదాపీర్, తాహిర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ చార్జీల భారం తగ్గించండి



విద్యుత్ చార్జీల పెంపుపై సంతకాలు సేకరిస్తున్న నాయకులు

పెనుకొండ: రాష్ట్ర ప్రభుత్వం విధించిన రూ.15,441 కోట్ల అదనపు విద్యుత్ చార్జీల బారం వెంటనే తగ్గించాలని సీపీఎం నేత హరి డిమాండ్ చేసారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద ఆదివారం సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో అదనపు విద్యుత్ చార్జీలను తగ్గింపుపై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా అదనంగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు పారదర్శకత, వినియోగదారుల ప్రయోజనాలు కాపాడుతామని, గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇలాంటి నిరంకుశ పోకడలకు స్వస్తి పలకాలన్నారు. కలసి వచ్చే రాజకీయ పార్టీలతో, ప్రజాసంఘాలతో కలసి ప్రజలను చైతన్య పరచి ట్రూ అప్ చార్జీలను తగ్గించే వరకు విడతల వారీగా పోరాటం చేస్తామన్నారు. నాయకులు రమేష్, బాబావలి, కాంగ్రెస్ నాయకులు నిస్సార్, రమేష్, ఫక్రోద్దీన్, గంగాధర్, హర్ష, మహబూబ్‌బాషా, ఆరిఫ్, ఉత్తప్ప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శుభకార్యం

అగళి: మండల పరిధిలోని హల్లికెర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలారప్ప కుమారుడు అమృత్ కుమార్ వివాహ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్పను మైలారప్ప శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దరాజు, నాయకులు నటరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు పురస్కారాలు

పావగడ: ఉచిత అంబులెన్స్ సేవలందిస్తున్న తాలూకాకు చెందిన సమాజ సేవకులు మెకానిక్ యూనిస్, కన్నడ పత్రిక విలేకరి రాంపురం నాగేశ్, వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు లోకేశ్ పాళేగార్, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్, నరసీ పాటిల్ తదితరులు ప్రతిష్టాత్మక భారతరత్న సేవా పురస్కారాలు అందుకున్నారు. బెంగళూరులోని హోటల్ సిటీ సెంటర్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన పురస్కారాల ప్రదానోత్సవంలో తృశ్రీ ఫౌండేషన్ నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. వారిని పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం

హిందూపురం: పట్టణంలోని బాలాజీ కళాశాలలో ఆదివారం మానవ హక్కుల దినోత్సవంతోపాటు గణిత శాస్త్ర పితామహుడైన శ్రీనివాస రామానుజన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీరభద్రప్ప మాట్లాడుతూ రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నతాస్థాయికి చేరుకోవాలన్నారు. విశ్రాంత ఎంఈఓ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, ప్రియాంక, ఎస్ఎస్ఎస్‌పీఓ ప్రియాంక, శ్వేత, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరాలయంలో 26 నుంచి నిత్యాన్నదానం

పావగడ: స్థానిక శనీశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం ఈనెల 26వ తేదీ నుంచి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎస్ఎస్‌కే ఆలయ సమితి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇదివరకే ప్రతి శుక్ర, శని, ఆది, సోమవారాలు భక్తులకు మధ్యాహ్నం, రాత్రి రెండు పూటల అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తోడుగా ఇక నుంచి మంగళ, బుధ, గురు వారాలు కూడా మధ్యాహ్నం పూట మాత్రమే అన్నదాన కార్యక్రమం నిర్వహించి నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. అలాగే ఎస్ఎస్‌కే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థ విద్యార్థులకు మధ్యాహ్నం పూట అన్నదానం చేస్తామన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర

పావగడ: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ పరిపాలన వైఫల్యాలను నిరసిస్తూ సోమవారం మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప తదితర జేడీఎస్ నాయకులు పాదయాత్ర చేపట్టనున్నారు. ఉదయం 8:30 గంటలకు తాలూకాలోని సీహెచ్ పాళ్య వద్ద ఉన్న మొరార్జీ వసతి పాఠశాల నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. ఏహెచ్ పాళ్య, సిహెచ్ పాళ్య, గుజ్జనడు, కోణనకుర్కె, దవడబెట్ట, కిలార్లహళ్ళి, బ్యాడనూరు గేట్, గుండార్లహళ్ళి మీదుగా సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర పావగడ పట్టణానికి చేరుకుంటుంది. ఆ తర్వాత 4:30 గంటల సమయంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌తో భేటీ అవుతారు. వివిధ సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తారు. పాదయాత్రలో జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎన్ఏ ఈరణ్ణ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

జగన్ జన్మదిన వేడుకల్లో 'తమ్ముళ్ల' కుట్ర

లేపాక్షి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని కోడిపల్లి గ్రామంలో శనివారం రాత్రి సర్పంచ్ మంజునాథ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. వేడుకలకు మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి కూడా హాజరయ్యారు. వందలాది మంది ఆనందంగా వేడుకలను నిర్వహిస్తున్న సమయంలో.. ఓర్వలేని ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వేడుకలను జరగనీయకుండా కుట్ర పన్నారు. పోలీసులపై ఒత్తిడి తేవడంతో కోడిపల్లికి వెళ్లి వేడుకలను పరిశీలించారు. అయితే అక్కడున్న స్పీకరు బాక్స్‌లను డీజేలుగా రంగులు పులిమి సీజ్ చేయించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదన్నారు. జరుగుతున్నది రాజకీయ వేదిక కాదని తెలిసినా కుట్రలు పన్ని అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు.

పాదయాత్ర బృందానికి భోజన వసతి

హిందూపురం: కాలినడకన తిరుమలకు బయలుదేరిన పాదయాత్ర బృంద సభ్యులకు ఆదివారం మోతుకపల్లి శ్రీనివాసరెడ్డి భోజన సదుపాయం కల్పించారు. హిందూపురం నుంచి తిరుమలకు దయాత్రగా బయలుదేరిన 250 భక్తులకు గడిదం వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద అన్నదానం చేశారు. అలాగే పండ్లు అందించారు. నవీన్ రెడ్డి, డైరీ గోపి, సతీష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి

మడకశిర రూరల్: మండల పరిధిలోని బుల్లసముద్రం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. ఆర్థికంగా సహాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందే వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని సూచించారు. ఈ రోడ్డు ప్రమాదం జరగడం చాల బాధకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

లక్ష్మీ నరసింహస్వామికి పూజలు

మడకశిరరూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని భక్తరపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి.. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, వైస్.ఎంపీపీ మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

హిందూపురం: దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తామని సక్షమ్ సంస్థ జిల్లా కన్వీనర్ పవన్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్‌పీజీటీరోడ్డులోని సక్షమ్ దివ్యాంగుల సేవా కేంద్రంలో పలువురు దివ్యాంగులకు వీల్ చైర్స్, వాకర్స్ యూడీఐడీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిశ్రీమాల్, బాబులాల్, కరాటే మాస్టర్ రామచంద్ర, ప్రణయ్, శైలెంద్ర పాల్గొన్నారు.


ప్రహరీ నిర్మించాలని వినతి

మడకశిర: పట్టణంలోని 3వ వార్డు పరిధిలో ఉన్న శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.బాబు తదితరులు కోరారు. శ్మశానవాటికలో చెత్తా చెదారం పేరుకుపోయి కంప చెట్లు పెరగడంతో దళితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశానవాటికకు స్థలం కూడా సరిపోవడం లేదని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులు మారినా శ్మశాన వాటికకు మోక్షం లభించలేదన్నారు. ఎమ్మెల్యే, అధికారులు చర్యలు తీసుకుని శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ: రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం ఉద్యానశాఖ అధికారి రాంప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్యాక్ హౌస్(30–20 అడుగులు) యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా రాయితీ రూ.2 లక్షలు లభిస్తుందని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్(5 వేల మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.4 లక్షలు కాగా రాయితీ రూ.1.4 లక్షలు ఉంటుందన్నారు. పండ్లు మాగబెట్టు గదులు (20 మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.20 లక్షలు కాగా రాయితీ 7 లక్షలు, సోలార్ కోల్డ్ రూం(14 మెట్రిక్ టన్నులు) యూనిట్ విలువ రూ.12.50 లక్షలు కాగా రాయితీ 4.37 లక్షలు, కలెక్షన్ సెంటర్(60–40 అడుగులు)యూనిట్ విలువ రూ.15 లక్షలు కాగా రాయితీ రూ.6 లక్షలు ఉంటుందన్నారు. మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్(టమోట కెచప్, సాస్ మొదలగు ఉత్పత్తులు) రూ.25 లక్షలు కాగా రాయితీ రూ.10 లక్షలు లభిస్తుందని తెలిపారు. ఫారంపాండ్, పండ్ల మొక్కల నర్సరీ తదితర వాటిపై రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. వివరాలకు స్థానిక హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: పరిగి రోడ్డులోని సేవా మందిరంలో ఉన్న ప్రశాంతి నిలయం వృద్ధాశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంతా ఆకట్టుకునేలా అలంకరించి వృద్ధుల మధ్య వేడుకలు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూపురం మున్సిపల్ చైర్మన్ బలరాం రెడ్డి హాజరై అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ జీసస్ చెప్పినట్లు ప్రతి ఒక్కరూ దానగుణం అలవర్చుకోవాలని, ఇవ్వడం నేర్చుకుంటే కావాల్సింది దగ్గర అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రశాంత నిలయం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.